క్లుప్తంగా

పశువైద్య శిబిరం



పశువులకు వైద్యం చేస్తున్న పశువైద్యులు

మానవపాడు: మండలంలో కలుకుంట్లలో గురువారం మండల పశువైద్యాధికారి సతీష్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 15గేదెలు, 15 ఆవులకు గర్భకోశ వ్యాధి నివారణ చేశారు. 25 మంది రైతులకు సంబంధించిన ఆవుదూడలకు నట్టల మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువై ద్య సిబ్బంది భీసన్న, బుచ్చమ్మ పాల్గొన్నారు.

విద్యతోనే వ్యక్తిత్వ వికాసం

గద్వాల రూరల్: విద్యతోనే వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని జయమిత్ర సాహిత్య వేదిక ప్రతినిధి అన్నారు. గురువారం స్థానిక ఎంఏఎల్‌డి డిగ్రీ కళాశాలలో సాహిత్యం-వ్యక్తిత్వ వికాసంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, సమరసింహారెడ్డి, డాక్టర్ నందిని, డాక్టర్ షేక్ కలేందర్ బాబ, డాక్టర్ దొడ్ల శ్రీపతినాయుడు, డాక్టర్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

గ్రామాల్లో ఫాగింగ్ కరువు

అలంపూర్ రూరల్: గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతుండడంతో వాటి నివారణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమౌతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్లపై మురుగు నీరు పేరుకుపోయి దోమలకు నిలయంగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. వాటిని శుభ్రం చేయడంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరు గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోగాలు వ్యాపించకుండా గ్రామాల్లో ఫాగింగ్ చేసేవిధంగా అధికారులు చొరవ చూపాలని, కలుషితమైన నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలి

రాజోళి: పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సెలవులు వస్తే మద్యం బాబులు రెచ్చిపోతుంటారని తెలిపారు. కేవలం ఆదివారం వస్తేనే పాఠశాల పరిసరాల్లో మద్యం తాగి పరిసరాలను అపరిశుభ్రం చేసే మద్యం బాబులు సెలవులు ఎక్కువగా వస్తే రోజూ అదే పనిలో ఉంటారని, అలాంటి వారిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. గతంలో అలాంటి పర్యవేక్షణ లేకపోవడంతోనే చాలా పాఠశాలల్లో కిటికీలు, తలుపులు ధ్వంసం చేశారని, గదుల్లో ఉన్న ఫర్నీచర్ ధ్వంసం చేశారని పేర్కొన్నారు. సర్పంచులు మొదలుకుని పోలీసుల వరకు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



గట్టు: మండలంలోని ఆరగిద్ద గ్రామ శివారులో గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. ఆరగిద్ద గ్రామ శివారులో పెంచికలపాడుకు చెందిన మాల పరశురాముడు ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు దివాకర్, నాగరాజులు పట్టుకున్నారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను గట్టు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్ మాల పరశురాముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెల్టుషాపులపై దాడులు

రాజోళి: మండల కేంద్రంలో పలు బెల్టుషాపులపై పోలీసులు దాడులు చేశారు. గురువారం రాత్రి నిర్వహించిన ఈ దాడుల్లో పలు చోట్ల అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ ఖాదర్ బాషా తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మద్యం తరలింపుపై, బెల్టుషాపులపై ప్రత్యేక దృష్టి సారించామని, ఈ క్రమంలో బెల్టుషాపులపై దాడులు చేశామని ఆయన తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

గట్టు: బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని గద్వాల ఎమ్మెల్యే కుమారుడు సాయికేత్ రెడ్డి ఇందువాసి, చమన్‌ఖాన్‌దొడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఇందువాసి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్టేట్ కన్స్యూమర్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, అంతంపల్లి సర్పంచ్ ఆంజనేయగౌడు, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్‌గౌడు పాల్గొన్నారు.

నీటి సంఘాలు కొలువుదీరేనా?



నిండు కుండలా ఉన్న తిమ్మాపురం సేరి పెద్ద చెరువు

- 15 ఏళ్లయినా జరగని ఎన్నికలు
- చెరువు, కుంటలపై కరువైన పర్యవేక్షణ
- ఆక్రమణకు గురవుతున్న ఖైనం
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వం



కోతకు గురై నీరు లేక ఎండిపోయిన ఇటిక్యాల లింగమ్మ చెరువు

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో నీటి నిల్వలను పెంచి అభివృద్ధి చేయడానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పనులు చేపట్టింది. చెరువులు, కుంటల అభివృద్ధి, వాటి నిర్వహణ, ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలను నిర్వహించడం మాత్రం మర్చిపోయింది. దీనివల్ల ప్రస్తుతం చెరువులు, కుంటల పరిరక్షణ ఎంతో కరువైంది. మిషన్ కాకతీయ పథకం ద్వారా ప్రభుత్వం గ్రామాల్లోని చెరువులను, కుంటలను శుభ్రం చేసి పునరుద్ధరించింది. కానీ నీటి సంఘాలకు, పాలక వర్గాలు లేకపోవడంతో చెరువులు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇప్పటికే నియోజకవర్గంలోని చాలా చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయని ఆయా మండలాల ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో చెరువులపై పర్యవేక్షణ ఇలా..

ప్రభుత్వం సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ విడుదల చేయగానే వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. ఎన్నిక కాబడిన పాలకవర్గ సభ్యులు చెరువులు, కుంటల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసుకోవడంతో పాటు నీటిని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. రైతులను ఎప్పటికప్పుడూ సమన్వయపరుస్తూ వివిధ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. 15 ఏళ్లైనా రాష్ట్ర ప్రభుత్వం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆక్రమణకు గురవుతూ చెరువులు, కుంటల నిర్వహణ ఎటుపోతుందో అర్థం కావడం లేదు.

మండలాల వారీగా వివరాలు..

మండలం	జీపీలు	చెరువులు, కుంటలు
ఇటిక్యాల	29	44
మానవపాడు	16	06
ఉండవెల్లి	16	03
అలంపూర్	14	08
రాజోళి	11	04
వడ్డేపల్లి	10	05
అయిజ	28	44

2008 నుంచి ఎన్నికల జాడేలేదు..

అలంపూర్ నియోజకవర్గంలో వంద ఎకరాల ఆయకట్టు, అంతకంటే తక్కువ ఆయకట్టు ఉన్న చెరువులు, కుంటలు మొత్తం 114 ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2006లో రాష్ట్ర వ్యాప్తంగా వంద ఎకరాలు ఆయకట్టు ఉన్న చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీ కాలం కేవలం రెండేళ్లు మాత్రమే ఉండటంతో 2008 లోనే ముగిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సాగునీటి సంఘాలకు తిరిగి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడి ఎనిమిదేండ్లయినా నీటి సంఘాల ఎన్నికల మాట ఊసెత్తడం లేదు. ప్రభుత్వం ప్రతి చెరువులో కూడా మిషన్ కాకతీయ పనులను చేపట్టింది. నీటి సంఘాలు లేకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా పనులను తూతూ మంత్రంగా చేసి చేతులు దులుపేసుకుంటున్నారు. దీనివల్ల పలు చెరువులు, కుంటలు వర్షాకాలంలో కోతకు గురై నీరు పూర్తిగా బయటికి వెళ్లింది. దీనివల్ల ఆయకట్టు రైతులు పంటలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చెరువులు, కుంటల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి వాటిని మరింత అభివృద్ధి చేయాలని ఆయా మండలాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

నీటి సంఘాలతోనే చెరువుల అభివృద్ధి..



నీటి సంఘాలను ఎన్నుకోవడం వల్లే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండటం వల్ల నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వారి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను అభివృద్ధి చేసింది. కానీ కాంట్రాక్టర్లు చెరువుల్లోని పూడిక పనులను సక్రమంగా చేయలేదు. చెరువులో పనులు జరిగేటప్పుడు నీటి సంఘాలు ఉంటే పనులు సక్రమంగా చేయించేవారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చెరువులను అభివృద్ధి చేయాలి.

– లక్ష్మన్న, రైతు, సాసనూలు

ఆదేశాలు వస్తే ఎన్నికలు నిర్వహిస్తాం..



వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులకు నీటి సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తప్పకుండా నోటిఫికేషన్ జారీ చేసి నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తాం. గతంలో చెరువుల అభివృద్ధి పనులు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు చూసుకునేవారు. ప్రస్తుతం నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో ఎన్నికల ప్రక్రియను చేపట్టడం లేదు. చెరువు పరిధిలో ఉన్న ఆయకట్టు రైతులు చెరువులను ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, తహసీల్దార్, ఇటిక్యాల

పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి

- జెడ్పీ చైర్ పర్సన్ సరిత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ సరిత

గద్వాల అర్బన్: పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. గురువారం మండలంలోని గుర్రంగడ్డ, బస్వాపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి నేటికీ పూర్తి చేయలేదన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటేష్, భీసన్న ఉన్నారు.

మల్దకల్: మండలంలోని బిజ్వారంలో 'తిరగబడుదాం-తరిమి కొడదాం' కార్యక్రమంలో భాగం గాగురువారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీల మాటలను ప్రజలు నమ్మిమోస పోవద్దన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు సరిత సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆమె కండువాలు కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవిందు, రాజారెడ్డి, రాములు, మద్దిలేటి పాల్గొన్నారు.

వర్మీ కంపోస్ట్ ఎరువులపై శిక్షణ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

ఉండవెల్లి: ఉన్నతి నైపుణ్యాభివృద్ధిపై 100రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా వర్మీకంపోస్టు ఎరువులపై శ్రద్ధ చూపాలని డీఆర్‌డీఓ ఉమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వర్మీ కంపోస్ట్ ఎరువులను తయారు విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్‌డీఓ ప్రారంభించారు. వర్మీ కంపోస్ట్, వర్మీ కల్చర్ మరియు వ్యవసాయ అనుబంధ రంగాలపైన ఉచిత నైపుణ్య శిక్షణలో శాస్త్రవేత్తలు భవాని, డైరెక్టర్ డా. దాదాసాహెబ్ వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయ్ శంకర్, మహేష్, శ్రీనివాస్, ఏపీఎం మారితమ్మ పాల్గొన్నారు.

అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా నర్సయ్య



మున్సిపల్ కమిషనర్లను సన్మానిస్తున్న సిబ్బంది

అలంపూర్: అలంపూర్ పట్టణంలోని మున్సిపల్ కమిషనర్‌గా నర్సయ్య బాధ్యతలు చేపట్టడంతో మున్సిపల్ సిబ్బంది సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న నిత్యానంద్‌కు వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అయిజ: మున్సిపల్ నూతన కమిషనర్‌గా నిత్యానంద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. రెండు సంవత్సరాలు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన గోల్కొండ నర్సయ్యను అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన నిత్యానంద్‌ను అయిజకు బదిలీ చేశారు.

కోతలకు నిరసనగా విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



ద్యాగదొడ్డి సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

గద్వాల రూరల్: మండలంలోని ద్యాగదొడ్డి సబ్‌స్టేషన్ పరిధిలో 15 రోజులుగా విద్యుత్ కోతల కొనసాగుతున్నాయి. దీనికి నిరసనగా గురువారం ధరూర్ మండలంలోని మాల్‌దొడ్డి, గార్లపాడు, నెట్టెంపాడు, ద్యాగదొడ్డి గ్రామాల రైతులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. విద్యుత్ కోతల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ, మిరప, పత్తి పంటలు ఎండుతున్నాయని, అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అక్కడికి చేరుకుని రైతులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అని చెబుతున్నా, సక్రమంగా 10 గంటలు కూడా రావడం లేదని ఆరోపించారు. రైతులను దృష్టిలో ఉంచుకుని కోతలు లేని నాణ్యమైన కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని, సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజేష్, హనిమిరెడ్డి, రాంచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాఘవేంద్ర, మహానంది, పాండు, ఆది మల్లారెడ్డి, తిమ్మారెడ్డి, బసిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఘన నివాళి

రాజోళి: రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందిన రాజోళి మాజీ సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డికి గ్రామస్తులు ఘనంగా నివాళులు అర్పించారు. కొత్త రాజోళి నుంచి శాంతి ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో ఆయనకు నివాళులు అర్పించారు.అంతకు ముందు మాజీ ఎమ్మెల్యేలు డీకే భరత సింహారెడ్డి, సంపత్‌కుమార్, రావుల రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఆర్‌డీఎస్ మాజీ చైర్మన్ సీతారామి రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలు రాజోళిలో నిర్వహించనున్నారు.

చిన్నారులకు ఆర్థికసాయం



అయిజ: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన అయిజ పట్టణానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు అలం ప్రవీణ్ కూతురు, కుమారుడికి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం గురువారం రూ.42 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంతకుముందు సంతాపసభ ఏర్పాటు చేశారు. అలం ప్రవీణ్ కుమార్ కూతురు, కుమారుడికి ఉచిత విద్యనందిస్తున్నట్లు శ్రీ కృష్ణవేణి, శ్రీ చైతన్య పాఠశాలల యాజమాన్యం తెలిపారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, పాఠశాల యాజమాన్యం తిమ్మప్ప, శ్రీనివాసులురెడ్డి, రవి కుమార్, మహేంద్ర, మధుసూదన్ రెడ్డి, సతీష్ కుమార్, వెంకటేష్, మల్లికార్జున్, పాల్గొన్నారు.

మందుబాబుల హల్‌చల్



పాఠశాల ఎదుట తాగి పడేసిన బాటిళ్లు

గద్వాల రూరల్: ధరూర్ మండల కేంద్రంలో మద్యం ప్రియుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. పబ్లిక్ ప్లేస్‌లు, నివాస గృహాలు, పాఠశాలలు ఇలా అన్ని ప్రదేశాలను వాడేస్తున్నారు. కాస్త చీకటి పడితే చాలు మందు బాబులు సిట్టింగ్‌లు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో సిట్టింగ్‌లు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌక్ సమీపంలోని కే.శే. గాండ్ల వీరప్ప స్టేడియం రాత్రయ్యిందంటే చాలు కుప్పలు తెప్పలుగా మందుబాబులు సిట్టింగ్‌లు దర్శనమిస్తున్నాయి. అక్కడ సిట్టింగ్‌లు వేస్తే అడిగే వారు లేరని మందుబాబుల అడ్డాగా మారిపోయింది. రేల్వేస్టేషన్ వెళ్లే మార్గంలో నివాస గృహాల ముందే మందు బాబులు సిట్టింగ్‌లు వేస్తున్నారు. బీరు బాటిళ్లు ఎక్కడపడితే అక్కడ పడేయడం, సీసాలను పగలగొట్టి రోడ్లపై వేసి పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. అదే ప్రాంతంలోనే ప్రైవేట్ పాఠశాల ఉండడంతో లీజర్ పిరియడ్, ఇంటర్‌వెల్ సమయంలో విద్యార్థులు అదే ప్రాంతంలో ఆడుకుంటారు. రాత్రి 11 గంటలైనా సిట్టింగ్‌లతో ఆ ప్రాంతం కలకలలాడుతుంటుంది. పై సూచించిన ప్రాంతాల్లో పోలీసులు గస్తీ నిర్వహించి మందుబాబుల నుంచి ఇబ్బందులు లేకుండా చూడాలని వీవర్ కాలనీతో పాటు రైల్వే స్టేషన్ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నరేష్‌కుమార్

అయిజ: ఎన్నికల నిబంధనల్లో భాగంగా పోలీసులు అయిజ పట్టణంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని రాయచూర్ రోడ్డు, గద్వాల టీరోడ్డు, కర్నూలు, రాయచూర్, ఉప్పలదొడ్డి పేటచౌరస్తా రోడ్లలో కార్లు, మోటార్ సైకిళ్లు, ఆర్టీసీ బస్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ రూ.50 వేలకంటే ఎక్కువ నగదు ఉంటే దానికి సంబంధించిన ఆధారాలు చూయించాలని కోరారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న నాగేష్ యాదవ్

అలంపూర్: నడిగడ్డ ఆత్మగౌరవ సభను వియవంతం చేద్దామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నియోజకవర్గ సమన్వయకర్త నాగేష్ యాదవ్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నడిగడ్డ హ క్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 16వ తేదీన అలంపూర్ ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆత్మగావర సభ శాంతినగర్‌లో జరగనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా క్రాంతిదళ్ రాష్ట్ర అధ్యక్షుడు సంఘం రెడ్డి పృథ్వీరాజ్, నడిగడ్డ హక్కు పోరాట సమితి చైర్మన్ గొంగ్లల్ల రంజిత్ కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్ రూరల్: ప్రబలుతున్న వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి అన్నారు. మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి తగిన సూచనలు, సలహాలు అందించి, మందులు పంపిణీ చేశారు. ప్రస్తుతం టైఫాయిడ్ తీవ్రంగా వ్యాపిస్తుండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టైఫాయిడ్ ఒక్కరికి వ్యాపిస్తే కుటుంబ సభ్యులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతగా ఉంచుకోవాలన్నారు. కలుషిత నీటిని తాగొద్దన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరిన వారితో డీకే స్నిగ్ధారెడ్డి

గద్వాల రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గద్వాల మండలానికి చెందిన పలువురు బీజేపీలో చేరినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రామాంజనేయులు, రాధకృష్ణారెడ్డి, పేపర్ నర్సింహులు, పరుమాల వంశీ, వరుణ్ ఉన్నారు.

శబ్ద కాలుష్యం చేస్తే చర్యలు తప్పవు

మానవపాడు: ప్రయాణికులు, పాదాచారుల, ప్రజల ఇబ్బందులు కలిగించేలా శబ్దం, వాయు కాలుష్యం చేసే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై చర్యలు తప్పవని ఎస్‌ఐ రాము హెచ్చరించారు. గురువారం మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులకు సూచనలు చేశారు. ట్రాక్టర్లకు, ఆటోలకు మ్యాజిక్ సిస్టమ్ జతచేసి, అతిగా శబ్దంతో ఇబ్బందులకు గురిచేస్తే వారిపై కేసుల నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్లు ఉన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు



ఉండవెల్లిలో బతుకమ్మలతో..



జల్లాపురంలో పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

మానవపాడు: మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నిపాడు జిల్లా పరిషత్ న్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ పండుగను ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్, మణిప్రసన్నల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, వెంకన్న, శ్రీలక్ష్మి, రాణి, శైలజ, అరవింద, సునీత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె రాఘవేంద్ర పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మామిడి తోరణాలతో అలంకరించారు. విద్యార్థినులు రంగుల పూలను సేకరించి, బతుకమ్మలను పేర్చారు. అనంతరం ఒక్కచోట చేరి ఆడిపాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవేంద్ర, వెంకటేష్, ఉపాధ్యాయులు అంజలి, భారతి, నవిత, పావని, స్వర్ణలత, వసంత, శ్రీదేవి, శారద పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలో బతుకమ్మ సంబరాలను ఆయా గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. దాసర్‌పల్లి, బిజ్వారం, అమరవాయి, మల్దకల్, తాటికుంట గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు బతుకమ్మ ఆడారు. దసరా పండుగ సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ముందస్తుగా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు నరేష్, సురేష్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలతో విద్యార్థుల నృత్యాలు అందరిని అలరించాయి. ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తుగా బతుకమ్మ పండుగ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో బతుకమ్మల ముందు ఆడిపాడారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నందిన్నె పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



అయిజలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు